క్లుప్తంగా

'ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనను'

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

యానాం: నియోజకవర్గ పరిధిలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనపై ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేసినప్పటికి తనను ఉన్నతాధికారులు ఇంకా అగౌరవ పరుస్తూనే ఉన్నారని ఈ కారణంగా ప్రభుత్వ కార్యక్రమాలను తాను బహిష్కరిస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ ప్రకటించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రజాసామ్యయుతంగా శాసనసభ్యుడిగా ఎన్నికైన తనతో సమానంగా ప్రొటోకాల్‌కు విరుద్ధంగా నామినేటెడ్ పదవితో కొనసాగుతున్న పుదుచ్చేరి ప్రభుత్వఢిల్లీ ప్రతినిధిని కావాలనే ప్రభుత్వ కార్యక్రమాలకు పిలుస్తున్నారని అన్నారు. యానాం శాసనసభ్యుడిగా ప్రొటోకాల్‌పై ఇప్పటికే ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేశానన్నారు. అధికారుల తీరుకు నిరసనగా శనివారం విద్యాశాఖ నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ముగింపు కార్యక్రమాన్ని బహిష్కరించినట్లు తెలిపారు.

మెప్మా ఉత్పత్తులను సద్వినియోగం చేసుకోవాలి

ముమ్మిడివరం: మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌లోని ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ సూచించారు. నగర పంచాయతీ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్ స్టాల్స్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. స్టాల్స్‌లోని పలు రకాల వస్తువులు, వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలను చైర్మన్‌తో పాటు పలువురు నాయకులు సందర్శించారు. కార్యక్రమంలో కమిషనర్ పి.రవివర్మ, నాయకులు చెల్లి అశోక్, తాడి నరసింహారావు, పిల్లి నాగరాజు, మెండి కమల, కాశి లాజర్, మేనేజర్ పీవీ నాగరాజు, ఆర్పి భాస్కరరావు, జే.సత్యనారాయణ పాల్గొన్నారు.

యాంటీ బయోటిక్స్ రహిత సాగు చేపట్టాలి

తాళ్లరేవు: ఆక్వారైతులు యాంటీ బయోటిక్స్ వినియోగించకుండా సాగు చేయాలని నాక్సా రీజనల్ కోఆర్డినేటర్ ఎన్పి చంద్రశేఖర్, సీఐఎఫ్ఈ కాకినాడ సీనియర్ సైంటిస్ట్ డా.మురళీధర్ అందే కోరారు. ప్రపంచ యాంటీ మైక్రోబయల్ నిరోధక వారోత్సవాలలో భాగంగా శనివారం స్థానిక లయన్స్‌క్లబ్‌లో ఆక్వారైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. మెప్డా ఆధ్వర్యంలో పనిచేస్తున్న నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ ఆక్వాకల్చర్(నాక్సా) సొసైటీ రైతులకు యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్)పై అవగాహన కల్పించారు. నాక్సా రాష్ట్ర కోఆర్డినేటర్ ఎస్.బాలాజీ, మత్స్యశాఖ ఏడీ జి.లావణ్య, ఫీల్డ్ మేనేజర్ కె.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

గున్నేపల్లి అగ్రహారంలో వైద్యశిబిరం

అమలాపురం రూరల్: గున్నేపల్లి అగ్రహారంలో సర్పంచ్ పెద్దిరెడ్డి రామచంద్రరావు ఆధ్వర్యంలో శనివారం చిన్న పిల్లలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అమలాపురం రోహిణి తల్లి పిల్లల ఆసుపత్రి వైద్యుడు వీఎస్ఎన్ మూర్తి 80 మంది పిల్లలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కేతా శ్రీలక్ష్మి, అనుపిండి సీతారామయ్య, పేరాబత్తుల నాగభూషణం, పెద్దిరెడ్డి శ్రీరామ్మూర్తి, పెద్దిరెడ్డి రామకృష్ణ, విప్పర్తి ఏడుకొండలు పాల్గొన్నారు.

ఆజాద్ ఫౌండేషన్‌కు పురస్కారం

అమలాపురం టౌన్: అంబాజీపేటలో శుక్రవారం జరిగిన అరిగెల బలరామమూర్తి సాహితీ కళాపీఠం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా అమలాపురం ఆజాద్ ఫౌండేషన్ అధ్యక్షుడు యల్లమిల్లి నాగ సుధా కొండ ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఈ పురస్కారాన్ని స్పెషల్ ప్రొటెక్షన్ ఎస్పీ కేఎస్ రావు, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. పురస్కారాన్ని అందుకు న్న కొండను అమలాపురం లయన్స్ క్లబ్ అధ్యక్షు డు రవణం వేణుగోపాలరావు అభినందించారు.

విద్యుత్ మోటార్ల చోరీ

అల్లవరం: గోడిలంక ప్రధాన రహదారిని అనుకుని పీహెచ్‌సీ పక్కనే ఉన్న ఆక్వా చెరువుల వద్ద శుక్రవారం రాత్రి 21 విద్యుత్ మోటార్లను దొంగలు ఎత్తుకెళ్లారు. గోడిలంక గ్రామానికి చెందిన నడింపల్లి రమేష్‌రాజు తన రొయ్యల చెరువులను కోడూరుపాడు గ్రామానికి చెందిన కోసూరి సాయివర్మకు లీజుకు ఇచ్చారు. ఆక్వా చెరువులను ఆరగట్టేందుకు చెరువులోని ఏరియాటర్లను గట్టుపైకి చేర్చారు. ఏరియాటర్లకు ఉన్న విద్యుత్ మోటార్లను విప్పేసి చావిడిలో భద్రపరిచారు. చెరువుల వద్ద ఎవరూ లేరని గ్రహించిన దొంగలు కాపుకాసి చావిడి తలుపులు బద్దలుకొట్టి భద్రపరిచిన 21 విద్యుత్ మోటార్లను చోరీ చేశారు. ఈ ఘటనపై లీజుదారుడు రమేష్‌రాజు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఎస్సై హరీష్‌కుమార్ దర్యాప్తు చేపట్టారు.

బ్రుసెల్లా టీకాలు వేయించాలి

అమలాపురం రూరల్ : ఆవులు, గేదెలలో వచ్చే ప్రమాదకరమైన వ్యాధి సెల్లా అని అమలాపురం పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డి తెలిపారు. భట్నవిల్లి గ్రామంలో శనివారం పశువులకు బ్రుసెల్లా వ్యాధి టీకాల కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యాధి సోకిన పశువుల్లో 6 లేదా7వ నెలలో చూడిగా ఉన్నప్పుడు ఈసుకు పోతాయని తెలిపారు. పశువులు మరల మరల తిరిగి పొర్లుతాయని తెలిపారు. ఒకసారి వ్యాధి సోకితే నివారణ ఉండదని రైతుకు ఆదాయపరంగా నష్టం కలుగుతుందనితెలిపారు.

అన్నదాతల గోడు పట్టదా..!


ఉప్పలగుప్తంలో ముంపులో వరిచేలు


సొంత ఖర్చులతో పూడిక తీసుకుంటున్న రైతులు

- పూడికలతో మూసుకుపోయిన డ్రెయిన్‌లు
- ఆధునీకరణపై దృష్టి సారించని అధికారులు
- ముంపుతో ఖరీఫ్ నష్టపోయిన రైతన్నలు
- రబీ వచ్చినా తీరని వెతలు

ఉప్పలగుప్తం: ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటను రక్షించుకోవాలంటే ముందస్తు రబీ నాట్లకు రైతులు సిద్ధం కావాలని అధికారులు సూచిస్తున్నారు. కానీ క్షేత్ర స్థాయికి వచ్చేసరికి ఇది ఆచరణ సాధ్యంగా కనిపించటం లేదు. ఖరీఫ్ సాగులో ఆరుగాలం కష్టపడిన రైతన్నకు ఆది నుంచి ఆటుపోట్లే ఎదురయ్యాయి. విత్తనం నాటిన నాటి నుంచి వాతావరణం పరిహాసమాడటంతో అన్నదాత కన్నీరుమున్నీరయ్యాడు. ఎగువ ప్రాంతాల్లో వరదలు సంభవించే సమయంలో వరిచేలు ముంపుకు గురై నష్టాలపాలయ్యాడు. దీనికి ప్రధాన కారణం మేజర్, మీడియం, మైనర్, రెవెన్యూ డ్రెయిన్‌లు పూడికలతో మేటలు వెయ్యడమే. క్షేత్ర స్థాయిలో అధికారులు వచ్చినప్పుడల్లా డ్రెయిన్‌లను ఆధునీకరించాలని రైతులు వినతి పత్రాలు ఇచ్చే పరంపర కొనసాగుతూనే ఉన్నా అధికారుల నుంచి ఎటువంటి చర్యలు ఉండటం లేదు. ప్రస్తుతం ఖరీఫ్ సాగులో కొన్ని ప్రాంతాల్లో చేలు కోతకు సిద్ధమయ్యాయి. ఖరీఫ్‌లో పంటలు ముంపుకు గురైన రైతులు రబీ సాగుకు సమయం ఆసన్నమవ్వటంతో ముందస్తు నారుమడి వేయటానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ చేల కంటే డ్రెయిన్‌లలో నీరు ఎక్కువగా ఉండటంతో ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో సతమతమవుతున్నారు. ఖరీఫ్ ఏలాగో నష్టపోయాం.. అధికారులు దృష్టి సాగించి డ్రెయిన్ వ్యవస్థపై చర్య తీసుకోకుంటే రబీ సాగుపై సైతం ఆశలు వదలుకోవలసిందేనని రైతులు ఆవేదన చెందుతున్నారు.

గతంలో అమలాపురం నియోజకవర్గ పరిధిలో రెండు పంటలు వరి, ఒక పంట పైరు పండేవి. కొన్ని సంవత్సరాలుగా ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల్లో పైరు పంటకు విరామం పలికి రెండు పంటలను మాత్రమే రైతులు పండించుకునేవారు. ప్రస్తుత పరిస్థితుల్లో డ్రైన్లు ముంపునకు గురి కావటంతో ఖరీఫ్ సాగుకు సైతం రైతులు ఆశలు వదులుకున్నా... అధికారులు బలవంతంగా నాట్లు వేయిస్తున్నారు. అమలాపురం మండలంలో 5,866 ఎకరాలు, అల్లవరంలో 4,855, ఉప్పలగుప్తంలో 7,434 ఎకరాల విస్తీర్ణంలో రబీ వరిసాగు జరుగుతోందని అధికారులు అంచనా వేస్తున్నారు. డ్రెయిన్ వ్యవస్థ ఇలాగే కొనసాగితే ఇందులో 15 నుంచి 20 శాతం రైతులు ముంపునకు భయపడి రబీ సాగుపై సైతం ఆశలు వదులుకుంటే వేరే ప్రత్యామ్నాయం లేదని ఆందోళన చెందుతున్నారు. అల్లవరం మండలంలోని రెల్లుగడ్డ, తుమ్మలపల్లి, దేవగుప్తం, తూర్పులంక, అల్లవరం, కొమ్మరిగిరిపట్నం, ఎంట్రుకోన గ్రామాల్లోను, ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లి, చల్లపల్లి, గోపవరం, కూనవరం, వానపల్లిపాలెం, ఉప్పలగుప్తం, పేరాయిచెరువు, గొల్లవిల్లి, భీమనపల్లి, సూదాపాలెం ప్రాంతాల్లో వరిచేలు ముంపునకు గురవుతున్నాయి. పదేపదే ముంపు సమస్యతో రెవెన్యూ, మైనర్, మీడియం, మేజర్ డ్రెయిన్లలో చెత్తా చెదారాలు పేరుకుపోవడంతో కొన్ని ప్రాంతాల్లో రైతులు సాగు చేయాలనే తపనతో సొంత ఖర్చులతో చెత్తను తొలగించడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందిస్తే రబీ సాగును ఆటంకం లేకుండా సాగు చేసుకుంటామని రైతులు మొరపెట్టుకుంటున్నారు.

పంట నష్టపోయాం



నేను 25 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నాను. ఖరీఫ్ సాగు చేసే సమయంలో అకాల వర్షాల కారణంగా దాదాపు 20 ఎకరాల్లో సాగు నీట మునిగింది. 5 ఎకరాల్లో పంట పండినా పూర్తిస్థాయిలో దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. రబీకు ముందస్తు నారుమడి వేయటానికి గత 10 రోజులుగా ప్రయత్నిస్తున్నాం. డ్రెయిన్‌లో నీరు ఎత్తుగా ఉండటంతో చేలో నీరు దిగక దమ్ము చేసే పరిస్థితి లేదు. అధికారులు స్పందించక రైతు చాలా నష్టపోతున్నాడు.

నల్లా వెంకటనారాయణ, రైతు, వాడపర్రు, ఉప్పలగుప్తం మండలం.

దృష్టి సారించాలి



డ్రెయిన్ తవ్వకాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రతి ఏటా వచ్చే ముంపు సమస్యతో చాలా నష్టపోతున్నాం. సాగు చేయాలంటే భయమేస్తోంది. డ్రెయిన్స్ అధికారులకు చెబుతామంటే వారు ఎప్పుడూ గ్రామాల్లో కనిపించే అవకాశం ఉండదు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సమస్యకు పరిష్కారం లభించడం లేదు. **చిట్టూరి చిన ఏడుకొండలు, రైతు, దేవగుప్తం, అల్లవరం మండలం.**

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం


బాబ్జీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శ్రీనివాసరాజు, నాయకులు

తాళ్లరేవు: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గంగుల బాబ్జీ కుటుంబాన్ని పార్టీ రాష్ట్ర నాయకులు చింతలపాటి శ్రీనివాసరాజు పరామర్శించి వారికి రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. శనివారం సుంకరపాలెంలోని గంగుల బాబ్జీ నివాసానికి ఆయన స్థానిక నాయకులతో కలిసి వెళ్లి పరామర్శించారు. బాబ్జీ మృతికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఇంజరం గ్రామ సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు కోరుకొండ కిరణ్‌కుమారి, గుత్తుల శ్రీను, మోర్త భీమాబాయి, గ్రామ కమిటీ కన్వీనర్‌లు చింతాకుల రాంబాబు, పెయ్యల కొండబాబు, చింతాకుల శ్రీనివాసరావు, కూరాటి వాసు, కాశి లక్ష్మణస్వామి, బొంతు సత్యన్నారాయణ, గుత్తుల వెంకటరమణ, చినరాజా, రాజు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆహారం అందజేత


దివ్యాంగులకు భోజనాలు వడ్డిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ మాజీ రాష్ట్ర కార్యదర్శి దివంగత మిండగుదటి మోహన్ 57వ జయంతి సందర్భంగా పార్టీ నాయకులు స్థానిక హరి మనో వికాస కేంద్రంలోని దివ్యాంగులకు శనివారం వితరణ కార్యక్రమం చేపట్టారు. కేంద్రంలో గల 45 మంది దివ్యాంగులకు రాత్రి భోజనం ఏర్పాటు చేశారు. దివంగత మోహన్ తనయుడు, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మిండగుదటి శిరీష్, పార్టీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు తోరం గౌతమ్ రాజా, విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి సత్తి శ్రీరామ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లెళ్ల రమేష్, దివంగత మోహన్ అభిమానులు ఎస్.సుబ్బారావు, ఎం.రాజా, ఎం.సతీష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

శెట్టిబలిజ వన సమారాధన విజయవంతం చేద్దాం


అమలాపురంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

అమలాపురం రూరల్: అమలాపురం కొంకాపల్లిలో సత్తెమ్మతల్లి ఆలయం వద్ద ఆదివారం జరిగే ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ వనసమారాధనను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. శనివారం అమలాపురం శ్రీరామపురంలో మంత్రి నివాసంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా జరిగిన వన సమారాధనలు విజయవంతమయ్యాయని ఈ ఏడాది మరింత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నామని దీనికి అంతా సహకరించాలని మంత్రి కోరారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ సంఘీయుల పటిష్ఠతకు వనసమారాధనలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. శెట్టిబలిజ సంఘం నేత పెచ్చేట్టి చంద్రమౌళి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ఈ కార్యక్రమం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా


కార్తిక వనసమారాధనలో దివ్యాంగులు


వనసమారాధనలో ఆర్‌ఏఓ మునిస్వామి, న్యాయమూర్తి రాజామోహన్, న్యాయవాదులు

తాళ్లరేవు: కార్తిక వనసమారాధనలో భాగంగా దివ్యాంగులు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. సీతారామపురం రిలయన్స్ ధీరూభాయి అంబానీ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్‌కు చెందిన దివ్యాంగులు శనివారం జి.వేమవరంలోని గ్రీన్ వ్యాలీ లేఅవుట్‌లో వనసమారాధనలో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెంటర్ ఇన్‌చార్జ్ ఎంవీ గోపాల్ నేతృత్వంలో వారికి ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. అనంతరం సామూహిక వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో సెంటర్ ప్రతినిధులు స్టీవెన్, ఉదయకుమారి, ఫిజియోథెరపిస్టులు శ్రీకాంత్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల కార్తిక వనసమారాధన

యానాం: యానాం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక దరియాలతిప్ప మాంగ్రూవ్ ఫారెస్ట్‌లో శనివారం కార్తిక వనసమారాధన ఘనంగా జరిగింది. కార్తికపూజల అనంతరం మడ అటవీ ప్రాంతాన్ని సందర్శించి న్యాయవాదులు ఆహ్లాదంగా గడిపారు. కార్యక్రమానికి ఆర్‌ఏఓ మునిస్వామి, సబ్‌కోర్టు న్యాయమూర్తి కె రాజామోహన్, ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం, ప్రభుత్వ న్యాయవాది, పబ్లిక్‌ప్రాసిక్యూటర్ సలాది దుర్గాశ్రీనివాస్, న్యాయవాదులు కె విజయకుమార్, పేర్ని ఆదినారాయణమూర్తి, బాషా, స్వరాజ్యలక్ష్మి, రామదాసు, నారాయణ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

తాళ్లరేవు: యానాం నుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు తాళ్లరేవు ఎక్సైజ్ సీఐ కె.కోటేశ్వరరావు తెలిపారు. కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెం గ్రామానికి చెందిన పెస్సింగి వీరబాబు అనే వ్యక్తి 150 మద్యం సీసాలను తరలిస్తుండగా దాడిచేసి పట్టుకున్నట్లు చెప్పారు. నిందితుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్సై వై.నాగేంద్రకృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, విష్ణు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు జిల్లా న్యాయమూర్తి నరేష్

ఉప్పలగుప్తం: మహిళలు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి వి.నరేష్ అన్నారు. విధానసే సమాధాన్ పేరిట మహిళలతో న్యాయ అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అక్షరాస్యతను పెంచాలన్నారు. రాజ్యాంగం కల్పించిన చట్టాలే మహిళల ఆయుధాలని.. మహిళలు పని చేసే ప్రదేశాల్లో సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గౌరీ శంకరరావు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సుకు మహిళలు కృషి చేయాలన్నారు. యువత విలాసవంతమైన జీవితానికి అలవాటుపడి నేరాలకు పాల్పడుతున్నారన్నారు. తల్లిదండ్రులు పిల్లలను అనునిత్యం గమనిస్తూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి చిన్నవరాజు, తహసీల్దార్ వీఎస్.దివాకర్, ఎంపీడీవో రాజ్‌కుమార్, ఎస్‌ఐ రాజేష్, ప్యానల్ న్యాయవాదులు,, ఏపీఎం సురేంద్ర పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ దివ్యాంగుడి మృతి

కుటుంబాన్ని ఆదుకోవాలని దివ్యాంగుల నిరసన


తాలూకా పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

అమలాపురం రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ దివ్యాంగుడు మృతి చెందిన ఘటన అమలాపురం రూరల్ మండలం బండారులంక గ్రామంలో జరిగింది. అమలాపురం తాలూకా ఎస్సై శేఖర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం పి.గన్నవరం మండలం నరేంద్రపురానికి చెందిన జిత్తుక శ్రీనివాసరావు(40) అమలాపురంలోని ఒక ప్రింటింగ్ ప్రెస్ లో పనిచేస్తున్నారు. గురువారం మోటార్ సైకిల్‌పై అమలాపురం వస్తుండగా బండారులంక దంగేటివారిపాలెం సెంటర్ వద్ద అమలాపురం నుంచి రాజమండ్రి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే అమలాపురం ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తాలూకా ఎస్సై శేఖర్‌బాబు తెలిపారు. కాగా శ్రీనివాసరావు కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ కోనసీమ దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగరపు పరశురాముడు ఆధ్వర్యంలో దివ్యాంగులు అమలాపురం తాలూకా పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

ముగిసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మల్లాడి

యానాం: పుదుచ్చేరి విద్యాశాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన శనివారంతో ముగిసింది. స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో జరిగిన ముగింపు కార్యక్రమానికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. యానాం ప్రాంతీయ సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రాజెక్టులు ఎంపిక కావడంతో పుదుచ్చేరి రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు వెళుతున్న విద్యార్థుల ప్రయాణ ఖర్చులకు గాను ఒక్కొక్కరికి రూ.2,500లు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో రాష్ట్రస్థాయి ఎంపికలు

యానాం: మూడు రోజుల పాటు స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో జరిగిన యానాం రీజినల్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఎగ్జిబిట్స్‌తో పాటు పాఠశాలల జాబితాను విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ శనివారం ప్రకటించారు. ఎంపికైన ఎగ్జిబిట్స్‌ను త్వరలో పుదుచ్చేరిలో జరిగే రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తారన్నారు.

శ్రీనివాసుడికి తిరుచ్చి సేవ


పల్లకీ ఉత్సవంలో భక్తులు

అమలాపురం రూరల్: బండారులంక బిళ్లవారి వీధిలో వేంచేసి యున్న పద్మావతీ అలమేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి మందిరం వద్ద పవిత్ర కార్తికమాసం సందర్భంగా తిరుచ్చి సేవను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన తిరుచ్చి పల్లకీపై స్వామి, అమ్మ వార్లను ఆశీనులను గావించి పురవీధుల్లో మంగళ వాయిద్యాల నడుమ ఊరిగేంపు నిర్వహించారు. బిళ్లవారి వీధి నుంచి ప్రారంభమైన తిరుచ్చిసేవ ఎగ్జిబిషన్ స్టేట్, వీరభద్ర స్వామిగుడి సెంటర్, వీరభద్రపురం శివాలయం వీధి వరకు సాగింది. పల్లకీసేవలో శ్రీనివాస అన్నదాన మహిళా సేవా సంఘం సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత స్వామి, అమ్మ వార్లకు విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. 2వేల మందికి అన్న ప్రసాద వితరణ జరిగింది.

ఘనంగా సత్యసాయి జయంతి

అమలాపురం టౌన్: భగవాన్ సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలను స్థానిక మొబర్లీపేటలో శనివారం వైభవంగా నిర్వహించారు. ఆ ప్రాంతానికి చెందిన విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ కేఎస్ఎన్ రావు స్వగృహంలో జరిగిన ఈ జయంతి వేడుకలకు పట్టణంలోని సత్యసాయి భక్తులు పాల్గొన్నారు. ఉదయం 5 గంటలకు సుప్రభాతంతో మొదలై సాయంత్రం వరకు కార్యక్రమాలు కొనసాగాయి. బాబా దివ్య బోధనలను సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు భక్తులకు వివరించారు. అనంతరం స్థానిక సరస్వతి శిశు మందిర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం,మిఠాయిలు సమకూర్చారు.

అల్లవరం: కొమరగిరిపట్నంలో సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన నిర్వహించారు, అనంతరం భారీ అన్న సమారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భారతీయ భాషల్లో కంటెంట్ సృష్టించాలి

యానాం: విద్యారంగంలో నూతన విద్యావిధానం కీలకపాత్ర పోషిస్తుందని ఈ నేపథ్యంలో స్థానిక చరిత్రపై దృష్టి సారిస్తూ భారతీయ భాషల్లో కంటెంట్‌ను సృష్టించేలా ప్రోత్సహించాలని ఎల్జీ కె కైలాష్‌నాథన్ విద్యావేత్తలను కోరారు. శనివారం జరిగిన జ్ఞాన్‌కుంభ్ విద్యాసదస్సులో ఆయన మాట్లాడారు. భారతీయ భాషలను ఆధునిక శాస్త్ర సాంకేతికత, విద్య, ఉపాధి భాషలుగా అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ నేపథ్యంలో భారతీయ భాషల్లోనే విద్యార్థులకు విషయాన్ని అందించాలని కోరారు. పుదుచ్చేరి చిన్న భాగమైనప్పటికి విద్యాకేంద్రంగా విరాజిల్లుతోందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యామంత్రి నమశ్శివాయం, స్పీకర్ సెల్వం తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపుల నిర్వాహకులపై చర్యలు

అమలాపురం టౌన్: అమలాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 1 నుంచి 22 వరకు నిర్వహించిన పలు దాడుల్లో 14 మంది బెల్ట్ షాపుల నిర్వాహకులను అరెస్ట్ చేసి వారి నుంచి 136 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. పాత కేసులు ఉన్న మరో 24 మందిని బైండోవర్ చేసి ఆయా మండలాల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ల ఎదుట హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. నాటుసారా, మాదక ద్రవ్యాల నియంత్రణ నిమిత్తం కామనగరువు, గంగలకుర్తి అగ్రహారం, ఏ.వేమవరం గ్రామాల్లో స్థానిక ప్రజలకు కౌన్సెలింగ్ ఇచ్చి అవగాహన ర్యాలీలు నిర్వహించినట్లు తెలిపారు.

దత్తత ప్రక్రియపై అవగాహన

అమలాపురం రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు అంతర్జాతీయ దత్తత మాసోత్సవాల్లో భాగంగా కామనగరువు గ్రామ పరిధి విత్తనాలవారి కాలువ గట్టు అంగన్వాడీ కేంద్రంలో శనివారం ప్రత్యేక దత్తత ప్రక్రియపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు అంగన్వాడీ సూపర్వైజర్ అన్నపూర్ణ హాజరై ప్రసంగించారు. మాతృత్వం ఒక వరమని, దత్తత దానికి మరో మార్గం అంటూ వివరించారు. చట్టపరమైన దత్తత ప్రక్రియపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. బాల కార్మికుల చేత వెట్టిచాకరీ చేయిస్తే సంబంధిత వ్యక్తులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఈ సదస్సులోడీసీపీవో ఉమాలక్ష్మి, శిశు గృహ మేనేజర్ వనజాక్షి, కే.సందీప్, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ మృతితో అలముకున్న విషాదం


లోవరాజు (ఫైల్)

అమలాపురం రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఐటీబీపీ కానిస్టేబుల్ మృతి చెందడంతో అమలాపురం మండలం పేరూరు చింతపల్లివారిపాలెంలో విషాదం చోటు చేసుకుంది. పేరూరు చింతపల్లివారిపాలెం గ్రామానికి చెందిన చింతపల్లి లోవరాజు (32) విశాఖలోని పందలపాక ఐటీబీపీ దళంలో గతంలో పనిచేసేవారు. ఆనందపురం మండలం వేములవలసలో కుటుంబంతో ఉంటున్నారు. ఇటీవల అసోం బదిలీ కావడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. అసోం నుంచి ఆనందపురం వచ్చిన అతను గత నెల 22న ఆనందపురం-పెందుర్తి సర్వీస్‌రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్ర వారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. లోవరాజుకు భార్య పల్లవి, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

కోరంగిలో ముగిసిన ఫార్మసీ వారోత్సవాలు


కోరింగ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో మాట్లాడుతున్న ఉదయభాస్కర్

తాళ్లరేవు: విద్యార్థినీ,విద్యార్థులు ఫార్మసీ రంగంలో ప్రతిభను కనబరచడం ద్వారా ఉజ్వల భవిష్యత్ పొందవచ్చని ఏపీపీఎస్సీ మాజీ సభ్యుడు, జేఎన్‌టీయూకే సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి పి.ఉదయభాస్కర్ అన్నారు. శనివారం కోరింగ ఫార్మసీ కళాశాలలో ఫార్మా వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏ రంగంలోనైనా ప్రతిభ ఉంటే వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. ముఖ్యంగా ఫార్మసీ రంగంలో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పలు పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. తొలుత ఫార్మసీ ప్రాముఖ్యతను తెలియజేస్తూ కోరంగి నుంచి తాళ్లరేవు సంతపేట సెంటర్ వరకు విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ ప్రగళ్లపాటి కనకరాజు, డైరెక్టర్‌లు చిట్టూరి కలికిమూర్తి, పి.నాగమణి, ప్రిన్సిపాల్ సువర్ణజ్యోతి, ఏట రత్నమాల పాల్గొన్నారు.